సాక్షి పార్వతీపురం మన్యం

మంగళవారం । 19 । మార్చి । 2024



ఐటీ ఆధారిత సేవలు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఆధునిక సాంకేతిక సేవల వినియోగంపై కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది.


- 8లో



చోరీకి చెడ్డీ గ్యాంగ్ యత్నం

చింతలవలన ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చెడ్డీగ్యాంగ్ దొంగతనానికి యత్నించింది.

- 8లో



న్యూస్‌రీల్

ప్రారంభానికి సిద్ధంగా తోణాం ఆరోగ్యకేంద్రం



రంగులతో సిద్ధంగా ఉన్న తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సాలూరు రూరల్: చిత్రంలో కనిపిస్తున్నది సాలూరు మండలం తోణాం పీహెచ్‌సీ. గతంలో ఇక్కడ ఉన్న పాతభవనంలో వైద్యసేవలు అందించేందుకు వైద్యులు నానా ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో కారిపోయిన, శిథిల గదుల్లోనే రోగులు సేవలు పొందేవారు. సమస్యను గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన ఈ ప్రాంత నాయకురాలు సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక 2012లో పీహెచ్‌సీకి కొత్త భవన నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖమంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేశారు. భవనం పనులు ఇంచుమించుగా పూర్తయ్యాయి. ప్రారంభానికి సిద్ధమైంది.

సీతంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుశాంత్‌కుమార్‌జెన్నా



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒడియా అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న సుశాంత్‌కుమార్ జెన్నా సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపొందారు. కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుశాంత్‌కుమార్‌జెన్నాను సిబ్బంది అభినందించారు.

ఎల్లారమ్మ తల్లి హుండీల ఆదాయం రూ.19.98లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది, సేవకులు

జామి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు జామి ఎల్లారమ్మ తల్లి జాతర ఆదాయం రూ. 19,98,401 వచ్చినట్టు ఆలయ ఈఓ ప్రసాదరావు తెలిపారు. అమ్మవారి ఆలయం ఆవరణలో దేవదాయశాఖ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీలు, విరాళాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. గత ఏడాది రూ.19,57,476లు ఆదాయం సమకూరగా, ఈ ఏడాది 40,925లు అదనంగా వచ్చినట్టు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్లు పద్మ, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

రేగిడి: మండలంలోని కాగితాపల్లి పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో వసతులు, ఓటర్ల వివరాలు, ఓటుహక్కు వినియోగించుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లపై ఆరా తీశారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎండ తగలకుండా టెంట్లు వేయాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద తాగునీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం ఉండాలని, నేమ్ బోర్డులు, మరుగుదొడ్లు, ర్యాంపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఆర్డీఓ బి.శాంతి, నియోజకవర్గ ఆర్‌ఓ జోసెఫ్, తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఎస్‌ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో హోమాన్ని జరిపిస్తున్న అర్చకుడు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం స్వామివారి వెండి మంటపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవం వేడుకగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ క్షేత్ర పాలకుడైన ఉమా సదాశివుడి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పదింతలు ప్రశాంతంగా..



పరీక్ష రాసేందుకు సిద్ధమైన విద్యార్థులు



హాల్‌టికెట్ల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



విజయీభవ: తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

- పదోతరగతి పరీక్షలు ప్రారంభం
- ఉత్సాహంగా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- తొలిరోజు పరీక్షకు 10,423 మంది హాజరు
- 323 మంది గైర్హాజరు
- అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పార్వతీపురం టౌన్: పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 66 కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు పరీక్షకు 10,746 మంది విద్యార్థులకు 10,423 మంది హాజరయ్యారు. 323 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఇతర అధికారులు తనిఖీ చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సరఫరాతో పాటు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో పక్కాఏర్పాట్లు చేసినట్టు డీఈఓ తెలిపారు. పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

17 కేంద్రాల్లో శతశాతం

ఈ ఏడాది విద్యార్థులకు అనుకూలంగా జిల్లా కేంద్రంలో అధిక పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. 17 కేంద్రాల్లో శతశాతం విద్యార్థులు పరీక్ష రాశారు.

ఎక్కడ చూసినా పరీక్షల సందడే

- జిల్లాలో ఎక్కడ చూసినా పరీక్షల సందడే కనిపించింది. ఈ ఏడాది పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు.
- ఉదయాన్నే ఇష్టదైవాలకు పూజలు చేసి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలిరోజు కావడంతో విద్యార్థుల వెంట తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు వచ్చారు. జాగ్రత్తలు చెప్పి సాగనంపారు.
- దూర ప్రాంతాల విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.
- నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అన్ని కేంద్రాలకు ప్రభుత్వం బెంచీలు సమకూర్చడంతో సౌకర్యవంతంగా పరీక్షలు రాయగలిగారు.

గిరిజన ఉత్పత్తులకు.. మద్దతు ధర

- జీసీసీ 2024-25 సంవత్సరంలో కొనుగోళ్ల లక్ష్యం రూ.10 కోట్లు
- జీసీఎంఎస్ పరిధిలో ఉత్పత్తుల తయారీ, విక్రయం
- 2022-23 రూ.10.36 కోట్ల విలువైన గిరిజన ఉత్పత్తుల కొనుగోలు
- 2023-24లో రూ.11.80 కోట్ల ఉత్పత్తులు కొనుగోలు



గుమ్మలక్ష్మీపురంలో చింతపండు కొనుగోలు చేస్తున్న జీసీసీ అధికారులు

పార్వతీపురం టౌన్:

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ(జీసీసీ)ను బలోపేతం చేసింది. గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించే చర్యలు చేపట్టింది. గతం కంటే వ్యాపారాన్ని విస్తరింపజేసింది. దళారుల ప్రమేయాన్ని కట్టడిచేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024–25 సంవత్సరంలో రూ.10కోట్ల విలువైన గిరిజన ఉత్పత్తుల కొనుగోలును లక్ష్యంగా జీసీసీ నిర్ణయించింది. దీంతో గిరిజన రైతులు సంతోషపడుతున్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా గిరిజనుల నుంచి మద్దతు ధరకు ముడిసరుకులను కొనుగోలు చేసిన జీసీసీ.. వాటిని నాణ్యమైన ఉత్పత్తులుగా మలుస్తోంది. జీసీఎంఎస్ ద్వారా తిరిగి జనం చెంతకు తక్కువ ధరకే చేర్చుతోంది. దీంతో అటు వినియోగదారులు, ఇటు గిరిజనులకు లాభాల వారధిగా నిలుస్తోంది. దళారుల బారినుంచి గిరిజనులను కాపాడుతూ ఏటా రూ.కోట్ల విలువైన వ్యాపారం సాగిస్తోంది. గిరిజనుల్లో ఆర్థిక వెలుగులు నింపుతోంది.

ఉత్పత్తులు ఇలా...

గిరిజనుల నుంచి తేనె, చింతపండు, నరమామిడి వంటి దాదాపు 26 రకాల ఆటవీ ఉత్పత్తులను ఏటా జీసీసీ కొనుగోలు చేస్తోంది. వాటిని కేంద్రాల్లో నిల్వ చేస్తోంది. ఏడు పారిశ్రామిక కేంద్రాల్లో ప్రాసెసింగ్ చేసిన అనంతరం ఉత్పత్తులను మార్కెట్లో వినియోగదారులకు అందుబాటులోకి తేవడమే దీని లక్ష్యం. పసుపు, కుంకుమ, తేనె, షరబత్, షాంపూలు, సబ్బులు, కాఫీపొడి తదితర 27 ఉత్పత్తులను రిటైల్ ప్రత్యేక ఔట్లెట్లు, సూపర్ బజార్లు, రైతు బజార్లతో పాటు ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా జీసీఎంఎస్ పరిధిలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో స్టాల్స్ పెట్టి విక్రయాలు నిర్వహించడమే కాకుండా మొబైల్ సేవల ద్వారా మారుమూలపల్లెలకు గిరిజన ఉత్పత్తులను చేరవేస్తోంది.



పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటుచేసిన స్టాల్

లక్ష్యం మేర కొనుగోళ్లు



గిరిజన ఉత్పత్తులు స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్ (ఫైల్)

పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన తొలి సంవత్సరం గిరిజన ఉత్పత్తులకు మరింత మార్కెటింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2023–24 ఆర్థిక సం వత్సరానికి రూ.11.80 కోట్ల విలువైన ముడిసరుకును కొనుగోలు చేశారు. వాటిని ఉత్పత్తులుగా మలచి మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. పార్వతీపురం జీసీసీ పరిధిలో 102 డిపోల్లో గిరిజన ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించి గిరిజనులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. 2024–25 సంవత్సరానికి రూ.10 కోట్ల విలువైన ఆటవీ ఉత్పత్తులు కొనుగోలును లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు.

జిల్లాలో అటవీ ఉత్పత్తుల కొనుగోలు ఇలా..

సంవత్సరం	కొనుగోలు (రూ.కోట్లలో)
2018–19	2.75
2019–20	1.64
2020–21	3.41
2021–22	4.30
2022–23	10.36
2023–24	11.80

జీసీసీ చెల్లిస్తున్న మద్దతు ధర

ఉత్పత్తి	మద్దతు ధర కిలోకు
చింతపండు	రూ. 32.49
కరక్కాయలు	రూ. 18
నల్లజీడిపిక్కలు	రూ. 18
తేనె	రూ. 200
ముసిడిక పిక్కలు	రూ. 60
మూరేడు గడ్డలు	రూ. 500
విప్ప పువ్వు	రూ. 29
కొండ చీపురు(1)	రూ. 45
ఉసిరిక పప్పు	రూ. 90
శీకాయలు	రూ. 55
కుంకుడు కాయలు	రూ. 60

ఊరూరా మార్కెటింగ్..



జీసీఎంఎస్‌కు మరింత ఆదాయం చేకూరేలా ఉత్పత్తులను గ్రామస్థాయ ప్రజలకు అందించేందుకు మొబైల్ సేవలను ప్రారంభించాం. ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులతో మాట్లాడి ఆర్ఎండీ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం. దీనివల్ల గిరిజనులు లబ్ధిపొందడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతి గ్రామానికి జీసీఎంఎస్ ఉత్పత్తులు సరఫరా అయ్యేలా మొబైల్ సేవలను విస్తృతం చేస్తాం. గిరిజనులు దళారుల చేతిలో మోసపోకుండా డిపోల ద్వారా ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేసి ఆర్థికంగా అండగా నిలుస్తాం.

– వి. మహేంద్ర కుమార్, డివిజనల్ మేనేజర్, జీసీసీ

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

- సమస్యలుంటే కంట్రోల్ రూమ్ నంబర్‌కు ఫోన్‌చేయాలి
- కలెక్టర్ నిషాంత్‌కుమార్



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ నిషాంత్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, కంట్రోల్ రూమ్‌కు అందిన ఫిర్యాదులపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. క్షేత్రస్థాయిలో ఎంసీసీ బృందాలు, వ్యయ ఖర్చులు, ప్రకటనలు, ప్రచారాలు, కార్యక్రమాలు ఇతర అంశాలను పరిశీలించేందుకు ఏర్పాటుచేసిన ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్ఎస్‌టీ బృందాలు తమ నివేదికలను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సమయంలోగా పంపించాలన్నారు. నివేదికల సమర్పణలో ఎలాంటి జాప్యం ఉండరాదన్నారు. కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్.వి.సూర్యనారాయణ, వివిధ శాఖల విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఓటర్లకు, ప్రజలకు ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే కంట్రోల్ రూమ్ 08963–796126, 08963–293046 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఎస్పీ కార్యాలయంలో అయితే సెల్: 89775 19101 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫ్లాగ్‌మార్చ్..



పార్వతీపురం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుపర్చాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు , కటౌట్లను తక్షణమే తొలగించాలన్నారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తూ పార్వతీపురం పట్టణంలో రిటర్నింగ్ అధికారి హేమలత, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సి-విజిల్‌లో అందే ఫిర్యాదులపై 100 నిముషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అందే ఫిర్యాదులపై అదే రోజు, మీడియాలో ప్రచురితమయ్యే ఫిర్యాదులు, ఇతర ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ సునాల్ షెరోన్, డీఎస్పీలు కృష్ణారావు, జి.మురళీధర్, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతనోత్సాహం



ఎమ్మెల్యే కళావతికి కేక్ తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ సీతంపేట నాయకులు

పాలకొండ/వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ శ్రేణులు నూతనోత్సాహంతో ఉన్నాయి. అనుకున్నట్టుగానే సిటింగ్ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పేరును పాలకొండ నియోజకవర్గ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటిచండంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. సీతంపేట మండల నాయకులు వండవలోని ఎమ్మెల్యే కళావతి కార్యాలయానికి సోమవారం వచ్చి కేక్ కట్‌చేసి ఎమ్మెల్యేకు తినిపించారు. విజయానికి కృషిచేస్తామని చెప్పారు.

ఎర్రజెండా వదిలి..



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- వైఎస్సార్‌సీపీలో చేరిన సీపీఎం కార్యకర్తలు
- సాదరంగా ఆహ్వానించిన కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: గుమ్మలక్ష్మీపురం మండలంలోని కుక్కిడి పంచాయతీ పరిధిలోని చింతమానుగూడ, రుషిని కాలనీ గిరిజన గ్రామాల నుంచి 30 కుటుంబాల వారు సీపీఎంను వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చినమేరంగిలోని తన స్వగృహంలో సోమవారం కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధిని చూసి ఆకర్షితులమై తామంతా పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో పి.బొడ్డు, బి శ్రీను, ఎం.కృష్ణ, పి.శంకర్, బి.కైలాశంతో పాటు ఇతర గ్రామస్తులు ఉన్నారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీ పురం ఎంపీపీ కుంబురిక దీనమయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీల విజేత మహేష్



చిన్నారిని సత్కరిస్తున్న ఎస్‌వీఆర్ కళాపరిషత్ సభ్యులు

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి జాతర సందర్భంగా ఎస్‌వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీల విజేతలను సోమవారం రాత్రి ప్రకటించారు. పోటీల్లో 13 మంది పాల్గొని పోటాపోటీగా ప్రదర్శనలు కనబరిచారు. వీరిలో వంగర మండలం కొప్పరవలసకు చెందిన వండాన మహేష్ హరిశ్చంద్ర నాటకంలోని అరణ్యసీను ఏకపాత్రాభినయానికి ప్రథమ స్థానం దక్కింది. పార్వతీపురానికి చెందిన పట్నాల నరసింహాచారి బృందం కాటిసీనుకు ద్వితీయ స్థానం, బత్తెముల సీనుకు సంబంధించి పార్వతీపురానికి చెందిన ఇట్లా సూర్యనారాయణ బృందం తృతీయస్థానం దక్కించుకుంది. వీరికి నగదు బహుమతులతోపాటు షీల్డ్‌లు అందజేశారు. అనంతరం రా.ర.వే అధ్యక్షుడు గార రంగనాథం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవిలతోపాటు పలువురిని సత్కరించారు. అంతకు ముందు కూచిపూడి నృత్యంతో ఆహుతులను అలరించిన చిన్నారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, ఆర్నిపల్లి వెంకటినాయుడు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు, ఎస్.సత్యనారాయణ, సలాది మహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పోలమాంబ తొమ్మిదవ జాతర


పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, మక్కువ మండలంలోని శంబర గ్రామదేవత పోలమాంబ అమ్మవారి తొమ్మిదవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. చదురుగుడి, వనంగుడి వద్ద తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

గేట్‌లో 288వ ర్యాంక్


విష్ణువర్ధన్

విజయనగరం అర్బన్: పబ్లిక్ సెక్టార్‌లో ఉన్నత స్థాయి ఇంజినీరింగ్ ఉద్యోగాలకు, ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో పీజీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే 'గేట్' పోటీ పరీక్షల్లో గంట్యాడ మండలం, లక్కిడాం గ్రామానికి చెందిన కిలపర్తి విష్ణువర్ధన్ 288 వ ర్యాంక్ సాధించాడు. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 798 స్కోర్ తెచ్చుకోగా ఈ ర్యాంక్ లభించిందని విష్ణువర్ధన్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాడు. తండ్రి కిలపర్తి అప్పలనాయుడు, సత్యవతి ఉద్యోగరీత్యా విజయనగరం పట్టణంలోని వీటీఅగ్రహారంలో ఉంటున్నారు. కోచింగ్‌కు ఎక్కడికీ వెళ్లకుండా మంచి ర్యాంక్ తెచ్చుకున్నందుకు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు వైద్య, ఆరోగ్యశాఖ గ్రీవెన్స్‌డే

పార్వతీపురం టౌన్: ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.శ్రీనివాస్ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే వారికి ఎవరికైనా జీతాలకు సంబధించిన సమస్యలు ఉంటే ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిని వ్యక్తిగతంగా కలసి వినతిపత్రాలు అందజేయాలని పేర్కొన్నారు.

విజయనగరంలో..

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పని చేస్తున్న వైద్య ఉద్యోగులకు మంగళవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్టు విజయనగరంజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలతో తెలిపారు. వేతనాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విన్నవించుకోవాలని సూచించారు.

100 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలసలో వ్యాపారి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న 100 కేజీల రేషన్ బియ్యన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ సోమవారం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వ్యాపారి డి.కామేశ్వరరావు ఇంట్లో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి మండల పౌర సరఫరాల అధికారికి అప్పగించినట్లు చెప్పారు.

పోక్సో కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నేరారోపణ రుజువైన అనంతరం ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 3,500 జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పు వెల్లడించిందని ఎస్పీ ఎం.దీపిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జామి మండలంలోని మొకాస కొత్తవలస గ్రామానికి చెందిన ఆబోతుల సత్తిబాబు గ్రామంలో నివాసం ఉంటున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు జామి ఎస్సై వీరబాబు పోక్సో చట్టం ప్రకారం 2023 సెప్టెంబర్ 20న కేసు నమోదుచేశారు. ఈ మేరకు విజయనగరం సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు దర్యాప్తు పూర్తిచేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో కోర్టు హెచ్‌సీ కారు శ్రీను సాక్షులను కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఎన్నికల నిర్వహణలో...

ఐటీ ఆధారిత సేవలు

- సాంకేతిక సేవల విస్తృత వినియోగం
- అవగాహన కల్పనలో ఎన్నికల అధికారులు బిజీ


యాప్‌లు, పోర్టల్‌లు వినియోగంపై శిక్షణ ఇస్తున్న నోడల్ అధికారి సుధాకరరావు

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక సేవల వినియోగంపై కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. అక్రమాల కట్టడి, ఫిర్యాదుల స్వీకరణ, అనుమతుల జారీ వంటి పలుసేవల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఆధారిత సాంకేతిక సేవలను అమలులోకి తెచ్చింది. వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా జిల్లా అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది, ఓటరుకు అందుబాటులోకి తెచ్చే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సువిధ, సీ-విజిల్, అబ్జర్వర్ పోర్టల్, పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫిర్యాదులపై తక్షణం స్పందించేలా అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే వ్యవస్థను తీసుకొచ్చింది. ఓటర్లు కూడా దీనిని సమర్థంగా వినియోగించుకునేలా ముందస్తు కసరత్తు జిల్లా స్థాయి నుంచి ప్రారంభించింది. దీనికోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లాలోని పలువురు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. వీరు ఏయే పనులు నిర్వహించాల్సి ఉంటుందనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమితులైన అధికారులకు తొలుత శిక్షణ ఇచ్చారు. పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, నోడల్, అకౌంటింగ్ బృందం, ఐటీ, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, వయోవృద్ధుల ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవడం వంటి అంశాలపై తర్ఫీదునిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఐటీ ఆధారిత సేవలను ఈసారి మరింత విస్తృతంగా వినియోగించుకోనున్నారు.

ప్రచార అనుమతులకు 'సువిధ' యాప్

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు తాము నిర్వహించుకునే సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు అధికార యంత్రాంగం నుంచి ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుంది. గతంలో అయితే మాన్యువల్‌గా రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీటి కోసం అభ్యర్థులు, వారి అనుచరులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. వీటికి సంబంధించిన అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు.

ప్రలోభాల కట్టడికి 'సీ-విజిల్'

ఎన్నికల్లో పోటీ అభ్యర్థుల ప్రలోభాలపై ఫిర్యాదులు తీసుకోవడానికి 'సీ-విజిల్' అనే యాప్‌ను వినియోగంలోకి తెచ్చారు. నగదు, మద్యం పంపిణీ, ఓటర్లను భయపెట్టి పోలింగ్ కేంద్రాలకు రాకుండా చేయడం ఇతర ప్రలోభాలకు గురిచేసి లబ్ధిపొందాలని చూడటం వంటి అక్రమాలను కట్టడి చేసేందుకు ఈ యాప్ అందుబాటులోకి తెచ్చారు. అక్రమాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు, లొకేషన్‌ను ఈ యాప్‌లో పొందుపరిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసే అధికారులు తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి దీనిని వినియోగించనున్నారు.

సేవలకు 'సాక్ష్యం'

ఎన్నికల నిబంధనలు, సేవలు వంటి అంశాలపై దివ్యాంగులకు అవగాహన కలిగించే యాప్ సాక్ష్యం. అదే విధంగా దివ్యాంకులకు ఇంటి వద్దే ఓటింగ్ చేసుకోవడానికి అవసరమైన సమాచార సేవలు అందిస్తుంది.

ఆదేశాల సత్వర అమలుకు...

ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి నుంచి వచ్చే ఆదేశాలు ఎన్నికల నిర్వహణ సిబ్బందికి వేగంగా చేరేలా చేసేందుకు అబ్జర్వర్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఈ పోర్టల్ పూర్తి స్థాయిలో పనిచేస్తుంది.



ఎన్నిక నిర్వహణలో వినియోగిస్తున్న వివిధ యాప్‌లు, పోర్టల్‌లు

ఓటర్లకు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్

ఓటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. తమ ఓటు ఉందా, లేదా... ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, ఆ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది, బూత్ లెవెల్ అధికారి ఎవరు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) సంఖ్య వంటి ఓటరుకు అవసరమైన సమస్త సమాచారాన్ని పబ్లిక్ పోర్టల్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సాంకేతిక సేవల వినియోగంపై అవగాహన

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచాలి. జిల్లా స్థాయి నోడల్ అధికారుల నుంచి క్షేత్రస్థాయి ఓటరు వరకు తెలుసుకోవలసిన పోర్టల్స్, యాప్‌లు ఉన్నాయి. వినియోగంపై విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాం. వీటి వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటే ఎన్నికలు విజయవంతంగా జరుపుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా ఎన్నికల నిర్వహణ సిబ్బంది పనిచేయాలి.

– ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పండిస్తున్న పంటల ఉత్పత్తికి కొనుగోలుదారులు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజులు తెలిపారు. ఈ మేరకు జిల్లా రైతులు పండిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం శిబిరాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో వ్యవసాయశాఖ రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, వినియోగదారులు కూడా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి సేద్యం కొంతకాలంగా అభివృద్ధి చెందుతోందని సంతోషం వెలిబుచ్చారు. ప్రకృతి వ్యవసాయం అతితక్కువ ఖర్చుతో కూడుకున్నదని, ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. గో ఆధారిత సహజ ఎరువుల, మిశ్రమాలతో ప్రకృతిలో సహజంగా దొరికే వనరులతో కషాయాలు, నూనెలు తయారు చేసుకుని, భూసారాన్ని పెంచుకుంటూ, చీడపీడల్ని నివారించి, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే పర్యావరణాన్ని కాపాడుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన రసాయన రహిత ఆహారాన్ని రైతులు అందిస్తున్నారని వివరించారు. రైతులు ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా పండించిన బియ్యం, మిల్లెట్స్, బెల్లం, కూరగాయలు మొదలైనవి ఈ శిబిరంలో విక్రయిస్తారని తెలిపారు. వాటిని కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది వై. తిరుపతిరావు, బి.తిరుపతినాయుడు, గంగరాజు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మహిళా పక్షపాతి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు

పార్వతీపురవ టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఒక అడుగు ముందుకు వేస్తే..అదే పేదలకోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నారన్నారని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మహిళా విభాగ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యను కూడా తీరుస్తూ మనకు అండగా నిలిచారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా మహిళల గౌరవాన్ని పెంచారని చెప్పారు. నాలుగున్నరేళ్ల ఆయన పరిపాలన కాలంలో రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం అమలు చేసినా మహిళల పేరిట అందజేసినట్లు చెప్పారు. మహిళలంతా జగనన్నకు ఆత్మబంధువుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మాధవి, జోనల్ ఇన్‌చార్జి పద్మావతి, దాసరి కార్పొరేషన్ చైర్మన్ రంగుముద్రి రమాదేవి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా టేకుచెట్ల నరికివేత

- రూ.లక్ష విలువైన కలప తరలించేందుకు యత్నం


పంప్‌హౌస్ ప్రాంగణంలో ఉన్న టేకు కలప

శృంగవరపుకోట: ఎన్నికల కోడ్ కూసింది. ఇక అధికారులు ఎవ్వరూ పట్టించుకోరు. దోచుకున్నవాడికి దోచుకున్నంత అనుకున్నాడు ఓ కాంట్రాక్టర్. సిబ్బందితో కుమ్మక్కై. పంప్‌హౌస్ ప్రాంగణంలోని టేకుచెట్లను అక్రమంగా నరికేసి తరలించడానికి ప్రణాళిక సిద్ధం చేశాడు. అయితే ఈ విషయం మీడియాకు చేరడంతో చివరి నిమిషంలో కలప రవాణాకు బ్రేక్ పడింది. విజయనగరం పురపాలక సంఘం అధీనంలో తాటిపూడి జలాశయం నుంచి విజయనగరం పట్టణానికి తాగునీరు పంపే మధుపాడ పంప్‌హౌస్ ప్రాంగణంలో టేకుచెట్లు ఉన్నాయి. పంప్‌హౌస్ మెయింటనెన్స్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న రాంప్రసాద్ ఆ టేకుచెట్లపై కన్నేశాడు. అక్కడి సిబ్బందికి నచ్చజెప్పి అక్రమంగా టేకుచెట్లు నరికేశాడు. కార్యాలయం ప్రాంగణంలోనే దర్జాగా కలపను సైజులు కోసి ఉంచారు. సోమవారం ఆ కలపను తరలించేందుకు రంగం సిద్ధం చేశాడు. దీంతో స్థానికులు కొందరు మీడియాకు సమాచారం ఇవ్వడంతో విషయం బయటకు పొక్కింది. టేకుచెట్లు ఎందుకు నరికారంటూ మీడియా ప్రతినిధులు అడగ్గా డీఈ అనుమతి తీసుకున్నామని కాంట్రాక్టర్ జవాబిచ్చాడు. డీఇ అప్పారావును దీనిపై వివరణ కోరగా, తనకేమీ సంబంధం లేదని తాను ఎవ్వరికీ పర్మిషన్ ఇవ్వలేదని చెప్పారు. సదరు కాంట్రాక్టర్ రెండు రోజులుగా చెట్లు నరుకుతున్నా అధికారులు పట్టించుకోకుండా వదిలేయడం వెనుక వారి పాత్ర కూడా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ కొందరు మీడియా ప్రతినిధులను ప్రలోభపెట్టి వార్తలు రాకుండా చూడాలని కొంత సొమ్ము ముట్టజెప్పినట్లు తెలిసింది. ఎస్.కోట అటవీశాఖ ఉద్యోగులు కోతకోసిన కలపకు కొలతలు వేసుకుని వెళ్లారు.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన లోలుగు కృష్ణ

సంతకవిటి: మండల పరిధిలోని చిత్తారిపురం గ్రామానికి చెందిన లోలుగు కృష్ణ(50)కు మతిస్థిమితం లేకపోవడంతో శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఇప్పటివరకు ఇంటికి చేరకపోవడంతో కొడుకు లోలుగు నారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడి మృతి

కొత్తవలస: కొత్తవలస నుంచి విజయనగరం వెళ్లే రైల్వే లైన్‌లో కంటకాపల్లి రైల్వేస్టేషన్ దగ్గరలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు (24) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి ఒడిశా నుంచి విశాఖ వెళ్తున్న రైలు నుంచి యువకుడు జారి పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు రైల్వే ఎస్సై రవివర్మ మాట్లాడుతూ మృతుడి శరీరంపై నీలం రంగు షార్టు, గళ్ల షర్టు ఉన్నట్లు తెలిపారు. మృతుడి కుడి మోచేతిపై ఓంకారం గుర్తును టాటూ వేసుకున్నట్లు గుర్తించామని, 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయి రంగు కలిగి ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్సై రవివర్మ

నేడు, రేపు జాకేరు రామాలయం వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో రామాలయం పదో వార్షికోత్సవాన్ని మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామసర్పంచ్ బుద్దా చిన్నమ్ములు అప్పలనాయుడు దంపతులు తెలిపారు. గ్రామపెద్దలు, గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్న వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం భైటో భజన, బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు. సీతారాముల కల్యాణోత్సవం, అన్నసమారాధన, మహిళల కోలాటం సాయంత్రం ఎడ్లబళ్ల పరుగు ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎడ్లు పరుగు ప్రదర్శనలో విజేతలకు నగదు బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరుతున్నామన్నారు.

చోరీకి చెడ్డీ గ్యాంగ్ యత్నం

- అడ్డుకున్న ఓ వ్యక్తికి తీవ్రగాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సీపీ రవిశంకర్


డ్రిల్లింగ్ మిషన్‌తో వేసిన రంధ్రాలు


పరిశీలిస్తున్న విశాఖ సీపీ రవిశంకర్ తదితరులు

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చెడ్డీగ్యాంగ్ దొంగతనానికి పాల్పడుతున్న క్రమంలో కేకలు వేసిన వ్యక్తిపై గ్యాంగ్ విచక్షణా రహితంగా దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఆ వ్యక్తి తీవ్ర గాయాల పాలై విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి 1గంట నుంచి 1.30గంటల ప్రాంతంలో సత్యనారాయణపురంలోని యారబాటి రమణమూర్తి ఇంటిలో చెడ్డీగ్యాంగ్ చోరీకి విఫలయత్నం చేసింది. ఇంటి ప్రధాన ద్వారం గ్రిల్స్‌కు ఉన్న ఐరన్‌నెట్‌ను డ్రిల్లింగ్ మిషన్‌తో కట్ చేసి తెరిచారు, అనంతరం ఉన్న తలుపు గడియ వద్ద డ్రిల్లింగ్ యంత్రంతో రెండు రంధ్రాలు వేసి తలుపులు తెరిచి ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటిలో యారబాటి రమణమూర్తి కుమారుడు లక్ష్మీభరద్వాజ్ దంపతులు నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశిస్తున్న క్రమంలో ఆ దంపతులకు మెలకువ రావడంతో ఎవర్రా మీరు అంటూ గట్టిగా కేకలు వేశారు. లక్ష్మీభరద్వాజ్ తండ్రి రమణమూర్తికి మెలకువ రావడంతో విద్యుత్ షాక్ వల్ల కేకలు వేసినట్లు భావించిన ఆయన పరుగెత్తుకుని వెళ్లి ఇంటి విద్యుత్ మెయిన్‌ను ఆపేశాడు. ఆ సమయంలో చెడ్డీగ్యాంగ్ చేతిలో ఉన్న వస్తువుతో విచక్షణారహితంగా లక్ష్మీభరద్వాజ్‌ను కొట్టి బయటకు వెళ్లిపోయారు. దొంగల దాడిలో తలకు, చేతికి తీవ్రగాయాలు కావడంతో లక్ష్మీభరద్వాజ్ విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సీపీ

ఏపీఎస్‌పీ బెటాలియన్‌కు ఎదురుగా ఉన్న అయినాడ పంచాయతీలోని సత్యనారాయణపురం విశాఖ పరిధిలోకి వస్తుంది. చెడ్డీగ్యాంగ్ దాడి సమాచారం తెలుసుకున్న విశాఖ సీపీ రవిశంకర్ సంఘటన స్థలానికి చేరుకుని రమణమూర్తి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రిలయన్స్ మాల్ ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ తుప్పల్లో చెట్టుకు ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం తెలిపారు. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని, విచారణ చేసినప్పటికీ ఎటువంటి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఎస్సై హరిబాబనాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. మృతుని బంధువులు ఎవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

300 లీటర్ల సారా స్వాధీనం


పట్టుకున్న సారాను చూపిస్తున్న పోలీసులు

పాచిపెంట: ద్విచక్రవాహనంపై అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు రూరల్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న పాచిపెంట మండల కేంద్రానికి చెందిన యర్ల సన్యాసిని పద్మాపురం జంక్షన్ వద్ద పట్టుకున్నామని చెప్పారు. అనంతరం 300లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.